

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వర్సిటీల భూమిని తిరిగి అప్పగించాలి

- ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24: విశ్వవిద్యాలయాల భూముల్లో హైకోర్టు నిర్మించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్ డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ వర్సిటీ నుంచి ప్రభుత్వం తీసుకున్న 100 ఎకరాల భూమిని తిరిగి వర్సిటీలకు అప్పగించాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ.. పరిశోధనలు పెంపొందించేందుకు ప్రోత్సహించాల్సిన ప్రభుత్వమే భూములను లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మరిన్ని భూములు కేటాయించాల్సింది పోయి, ఉన్న భూములను లాక్కుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆంజనేయులు, సాయికిరణ్, కృష్ణ, ప్రశాంత్, రాజు, శ్రీధర్, నిహారిక, హుస్సేన్, లావణ్య, కార్తీక్, రాజేంద్రబాబు, సందీప్, యశ్వంత్, రాజ్‌కుమార్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉద్యమాన్ని పెడచెవిన పెడ్తారా?: జూలకంటి

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): గుండెకాయ లాంటి వర్సిటీల భూములు ఇతర సంస్థలకు అప్పగించటం మానుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవరణలో 16 రోజులుగా విద్యార్థులు చేస్తున్న ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఉద్యమాన్ని పెడచెవిన పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారి గొంతు నొక్కేస్తున్నదని మండిపడ్డారు. కబ్జాలో ఉన్న భూమిని సేకరించి స్వాధీన పర్చుకోవాలని, వర్సిటీ భూములను కాపాడాలని అన్నారు. మన వ్యవసాయ యూనివర్సిటీకి ప్రపంచ వ్యాప్త గుర్తింపు ఉన్నదని, మనకు అన్నం పెట్టే వర్సిటీని కాపాడుకోవాలని న్యాయమూర్తులు సీఎంకు గుర్తుచేయాలని సూచించారు.

ఏఐబీపీ పనులపై 29న సమావేశం

- తెలంగాణ, కర్ణాటకతో నిర్వహించనున్న జల్‌శక్తి శాఖ

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): సత్వర సాగునీటి ప్రయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) పనుల పురోగతిపై కేంద్ర జల్‌శక్తి శాఖ ఈ నెల 29న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నది. ఏఐబీపీ కింద తెలంగాణలో 11 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం దేవాదుల, పెద్దవాగు, రాజీవ్‌భీమా తదితర ప్రాజెక్టుల పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల భూసేకరణ జాప్యం వల్ల పనులు ముందుకు సాగడంలేదని, దీన్ని అధిగమించేందుకు రూ.140 కోట్లు విడుదల చేయాలని గతంలోనే కేంద్రానికి తెలంగాణ ప్రతిపాదనలు పంపింది. దీంతోపాటు మరిన్ని అంశాలపై జల్‌శక్తి శాఖ సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు.

హైకోర్టు న్యాయవాదుల నిరసన ప్రదర్శన

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): న్యాయవాదులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ బుధవారం హైకోర్టు 6వ గేటు ఎదుట న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్‌డెంజర్స్ లాయర్స్ డే సందర్భంగా భారత ప్రజా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నేతలు ఎం వెంకన్న, డీ సురేశ్‌కుమార్, లింగయ్య మాట్లాడారు. న్యాయవాదుల రక్షణకు 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురావాలని డిమాండ్ చేశారు.

జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లారు!

- విద్యార్థినిపై పోలీసుల జులుం
- యువతి జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లిన ఖాకీలు
- ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తే ఇంతే ఉంటదని హెచ్చరిక
- కాంగ్రెస్ పాలనలో ఇదీ 'ఫ్రెండ్లీ పోలీసింగ్'!
- ఆ పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు
- నిరసనలో రాష్ట్ర వ్యవసాయ వర్సిటీల విద్యార్థులు

రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో పరిగెడుతున్న విద్యార్థిని బైక్‌పై వెంబడించి జట్టుపట్టి రోడ్డుపై ఈడ్చుకెళ్తున్న మహిళా పోలీసులు

వ్యవసాయ యూనివర్సిటీ/ హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ): అది రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ.. హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం జారీ చేసిన జీవో 55ని వెనక్కి తీసుకోవాలని కొన్ని రోజులుగా రోజులు శాంతియుత నిరసనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం కూడా నిరసన జరుగుతున్నది. సమయం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఒక విద్యార్థిని యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దంటూ ఉపన్యసించింది.

అప్పుడే రంగప్రవేశం చేసిన పోలీసులు.. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను చెదరగొట్టారు. ఈ క్రమంలో ఓ యువతి పరుగెత్తగా, బైక్‌పై వెంబడించిన ఇద్దరు మహిళా పోలీసులు.. ఆమె జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లారు. ఆ యువతి అదుపు తప్పి రోడ్డుపై కుప్పకూలినా, ఆమె జుట్టు వదలకుండా ముందుకు లాక్కెళ్లారు. దీంతో ఆమెకు చేతులు, కాళ్లు, శరీరముందు భాగంలో గాయాలయ్యాయి. 'ఇదేం పద్ధతి?' అని ఆ బాధిత యువతి కంటతడి పెట్టుకుంటూ ప్రశ్నించగా, ఇట్లనే ఉంటది సీన్ అంటూ ఆ కానిస్టేబుల్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వటం గమనార్హం.

ఇదేం పాలన?

ఈ ఘటనపై ప్రజలు తీవ్రంగా మండిపడ్డారు. సోషల్ మీడియాలోనూ నెటిజన్లు ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆ విద్యార్థిని ఏం అడిగింది? యూనివర్సిటీకి చెందిన భూములను ఇతర నిర్మాణాలకు ఇవ్వొద్దని కోరింది. ఇందులో ఆమెకు సొంతంగా ఒనగూరేది ఇసుమంతైనా ఉన్నదా? లేదు. రేపటి తరానికి భరోసానిచ్చేలా వ్యవసాయ యూనివర్సిటీ ఉండాలనేదే ఆమె ఆకాంక్ష. ఎవరైనా తమ నిరసన తెలుపవచ్చని సీఎం రేవంత్ చెప్తూనే ఉన్నారుగా! మరి ఈ ప్రకటనకు తగ్గట్టు పరిస్థితులు ఉన్నాయా? లేనేలేవు. అమ్మాయి అని కూడా చూడకుండా గొరగొర ఈడ్చుకెళ్లటమా?' అని ధ్వజమెత్తారు. నాడు తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై పోలీసుకాండ కొనసాగించిందని, హాస్టళ్లలోకి చొరబడి లైట్లు ఆర్పేసి అమ్మాయిపైనా లాఠీలతో విరుచుకుపడ్డారని గుర్తుచేస్తున్నారు. పదేండ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసులు మరోసారి మళ్లీ కఠినత్వానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు మహిళా కానిస్టేబుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులను గూండాలుగా చూస్తారా?: ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

దేశానికి అన్నం పెట్టే వ్యవసాయ యూనివర్సిటీ భూములతో రియల్ వ్యాపారం చేయడం సిగ్గు చేటని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ మండిపడ్డారు. పర్యావరణానికి దోహదపడుతున్న జీవరాశిని కాపాడాల్సిన పాలకులే, నాశనం చేయాలని చూస్తే సహించేది లేదని మండిపడ్డారు. నిరసన చేపట్టిన విద్యార్థులను గూండాలుగా చూస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాగా, నిరసనల్లో వ్యవసాయ వర్సిటీ విద్యార్థులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నాగర్ కర్నూల్ జిల్లా పాలెం, సిరిసిల్ల, వరంగల్, ఆదిలాబాద్, వరంగల్, సిరిసిల్ల, అశ్వారావుపేట, జగిత్యాల, ఆదిలాబాద్, సంగారెడ్డి వ్యవసాయ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్?: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థినిపై పోలీసుల దాడి అమానుషమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఇది తీవ్రంగా ఆందోళన కలిగించే అంశమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటివి ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. 'ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్?' అని ప్రశ్నించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ప్రభుత్వాన్ని నిలదీశారు. పోలీసులు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ మానవ హక్కుల సంఘం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని, దాడికి పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘటనపై చర్యలకు విచారణ

జూబ్లీహిల్స్, జనవరి24: వ్యవసాయ వర్సిటీ భూముల వ్యవహారంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న సంఘటనపై పోలీసులు స్పందించారు. విద్యార్థినిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్ళిన ఘటనలో సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు విచారణ జరుపుతామని వెల్లడించారు. ఈ మేరక కొందరు పోలీసు సిబ్బంది అనుచిత చర్యలకు సంబంధించిన వీడియోలు సైబరాబాద్ పోలీసుల దృష్టికి వచ్చినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ వ్యవహారంపై తగిన చర్యలు చేపట్టేందుకు సమగ్ర విచారణ జరుపుతున్నామని తెలిపారు.

వ్యవసాయ వర్సిటీ ఆవరణలో విద్యార్థుల ధర్నాలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

'లెండి'పై కోదండరాం తొండి వాదన

- ప్రాజెక్టుపై టీజేఎస్ అధ్యక్షుడివి పసలేని ఆరోపణలు
- మహారాష్ట్ర సర్కారు నిర్లక్ష్యానికి కేసీఆర్‌పై విమర్శలు
- పక్క రాష్ట్రంలోని బీజేపీ సర్కారును ప్రశ్నించని వైనం
- మద్నూర్, బిచ్కుంద జల సమస్యకు బీఆర్ఎస్ ప్రణాళిక

నిజామాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దులో ఉన్న అంతర్రాష్ట్ర ప్రాజెక్టు 'లెండి'పై టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం చేసిన విమర్శలు ఆయన వ్యక్తిత్వాన్నే ప్రశ్నించేలా చేస్తున్నాయి. మహారాష్ట్ర సర్కారు చేసిన నిర్లక్ష్యాన్ని కేసీఆర్ ప్రభుత్వానికి ఆపాదించడానికి యత్నించడం విమర్శలకు దారితీసింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో గల లెండి ప్రాజెక్టు ద్వారా మొత్తం 40 వేల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నది ప్రణాళిక. ఇందులో తెలంగాణ రాష్ట్రంలోని జుక్కల్ నియోజకవర్గంలో 22 వేల ఆయకట్టుకు సాగునీటిని అందించాలి. మూడున్నర దశాబ్దాల క్రితం పురుడుపోసుకున్న లెండి ప్రాజెక్టు పరిస్థితి ఒక అడుగు ముందుకు, ఐదు అడుగులు వెనక్కు అన్నట్టుగా మారింది. దీనంతటికీ మహారాష్ట్ర సర్కారు తీరు ప్రధాన కారణం. 2014 వరకు సమైక్య పాలకులు ఈ లెండి ప్రాజెక్టు జోలికి పోలేదు. అప్పట్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ కనీసం లెండి గురించి ఎన్నడూ మాట్లాడలేదు. తెలంగాణ సిద్ధించిన తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ మాత్రం ఈ ప్రాంతంపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువ మంజీర పరీవాహక ప్రాంతా ల్లో నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్‌కు శ్రీకారం చుట్టి పనులు ప్రారంభించారు. లెండి ఆయకట్టు పరిధిలోకి వచ్చే మద్నూర్, బిచ్కుంద మండలాలకు మంజీర నీటినే తరలించాలని ప్రణాళికలు రచించారు. తద్వారా లెండి ప్రాజెక్టుపై ఆధారపడకుండానే ప్ర'జల' సమస్యను తీర్చేందుకు కేసీఆర్ కృషి చేశారు. కాగా.. ఈ నెల 23న కోదండరాం జుక్కల్ నియోజకవర్గంలోని తన స్నేహితుడి కుటుంబంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. ఇక్కడి దాకా వచ్చిన ఆయన ఇటు నుంచి మహారాష్ట్రలోని లెండి ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. ఒకట్రెండు గేట్లు కూడా పెట్టని అక్కడి బీజేపీ సర్కారు దౌర్భాగ్యాన్ని పరిశీలించారు. అనంతరం తెలంగాణలో అడుగుపెట్టిన కోదండరాం.. కేసీఆర్ ప్రభుత్వంపై నిందలు వేసేలా మాట్లాడటం అక్కడున్న వారిని ముక్కున వేలేసుకునేలా చేసింది. లెండి ప్రాజెక్టు పూర్తయితేగానీ.. నీళ్లను దిగువకు వదిలే పరిస్థితి లేదు. లెండి పూర్తి కావాలంటే బీజేపీ తీరును ఎండగట్టాలి. కానీ కోదండరాం కేసీఆర్ సర్కారునే ప్రశ్నించారు.

ఈ ఏడాది తిండికి తిప్పలే?!

- 6 రాష్ట్రాలు, 2 యూటీల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- యాసంగిలో గోధుమ పంటపై ప్రభావం పడే ప్రమాదం
- ప్రభుత్వ గోదాముల్లో ఇప్పటికే ఏడేండ్ల కనిష్ఠానికి నిల్వలు





(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): దేశంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ఈ ఏడాది ఆహార సంక్షోభానికి కారణం కావొచ్చన్న భయాలు మొదలయ్యాయి. ప్రభుత్వ గిడ్డంగుల్లో ఇప్పటికే అడుగంటిన ధాన్యపు నిల్వలు ఒకవైపు ఆందోళన రేపుతుండగా, గోధుమలను పండించే ప్రధాన రాష్ట్రాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు సంక్షోభ భయాలను రెట్టింపు చేస్తున్నాయి. డిసెంబర్, జనవరిలో పంజాబ్, హర్యానా, హిమాచల్, ఉత్తరాఖండ్ తదితర 6 రాష్ట్రాలు, మరో రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో (యూటీల్లో) 54 శాతం నుంచి 85 శాతం వరకు లోటు వర్షపాతం నమోదైనట్టు భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. దీంతో యాసంగి సీజన్‌లో ధాన్యం ఉత్పత్తి భారీగా పడిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు, ప్రభుత్వ గోదాముల్లో గడిచిన ఏడేండ్లలో ఎన్నడూ చూడని స్థాయికి గోధుమల నిల్వలు పడిపోయాయి. జనవరి 1నాటికి దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వ గోదాముల్లో గోధుమల స్టాక్ 163.53 లక్షల టన్నులుగా ఉన్నట్టు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), స్టేట్ ఫుడ్ ఏజెన్సీల గణాంకాలను బట్టి తెలుస్తున్నది. 2017 తర్వాత (అప్పుడు 137.47 లక్షల టన్నులు) ఈ స్థాయిలో నిల్వలు పడిపోవడం ఇదే తొలిసారి.

అక్రమ భూ లావాదేవీల సూత్రధారులెవరు?

రంగారెడ్డి జిల్లాలో 98 దస్తావేజుల అక్రమ రిజిస్ట్రేషన్లపై తేలని గుట్టు

రంగారెడ్డి, జనవరి 24 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా పెద్ద ఎత్తున అక్రమ భూ లావాదేవీలు జరిగిన ఉదంతంలో విచారణ ఇంకా కొనసాగుతుండగా, ఇప్పటివరకు అసలు పాత్రధారులెవరు? సూత్రధారులెక్కడ? అనేది తేలలేదు. ఈ నేపథ్యంలోనే ధరణి కమిటీ ముందు బుధవారం రంగారెడ్డి కలెక్టర్ శశాంక హాజరవడంప్రాధాన్యతను సంతరించుకున్నది. పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేసేందుకు సమాయత్తమవుతున్న ప్రభుత్వం ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్న అక్రమాలపై కూలంకషంగా చర్చించినట్టు తెలుస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో 98 ఫైళ్లకు సంబంధించి అక్రమ లావాదేవీలు జరిగాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సైతం రిజిస్ట్రేషన్లు జరిగాయి. కలెక్టర్ దగ్గర దీనికి సంబంధించి 'కీ' ఉండగానే ఈ వ్యవహారం చోటుచేసుకున్నది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం అప్పటి కలెక్టర్ భారతీహోలికెరిపై బదిలీవేటు వేసింది. బాధ్యులైన ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులపై పోలీసు కేసు నమోదు చేశారు. దీనిపై ఓ పక్క పోలీసు విచారణ జరుగుతుండగా.. ఈ అక్రమ బాగోతంలో అసలు సూత్రధారులు, పాత్ర ధారులెవరు? అన్నది సీసీఎల్ఏ స్థాయిలోనే తేల్చే పనిలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

భూ సమస్యల పరిష్కారానికి.. 'మూడు మార్గాలు'!

- ధరణి కమిటీ ప్రాథమిక నిర్ణయం
- కలెక్టర్లతో సుదీర్ఘంగా చర్చలు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌తోపాటు రాష్ట్రంలో భూ సమస్యలపై అధ్యయనం చేస్తున్న కమిటీ బుధవారం సచివాయంలో సుదీర్ఘంగా సమావేశమైంది. కమిటీ సభ్యులు రేమండ్ పీటర్, సునీల్ కుమార్, కోదండరెడ్డి, మధుసూదన్, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, సీఎంఆర్వో డైరెక్టర్ లచ్చిరెడ్డి హాజరయ్యారు. సిద్దిపేట, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల కలెక్టర్లతోపాటు ధరణి సాఫ్ట్‌వేర్‌ను నిర్వహిస్తున్న టెర్రాసిస్ కంపెనీ ప్రతినిధులు సమావేశానికి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్లు కమిటీ సూచన మేరకు ఏడు అంశాలపై సమగ్ర వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలను మూడు మార్గాల్లో పరిష్కరించవచ్చని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. సాఫ్ట్‌వేర్ మార్పులు, వ్యవస్థాగత మార్పులు, చట్టపరమైన మార్పులు అవసరమని వారు అభిప్రాయపడినట్టు సమాచారం. వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దుతో ప్రస్తుతం రెవెన్యూశాఖలో క్షేత్రస్థాయిలో సిబ్బంది లేరని, ఇది దరఖాస్తుల పరిష్కారంపై ప్రభావం చూపుతున్నదని కమిటీ గుర్తించింది.

కృష్ణా జలాల ఎత్తిపోతకు ఏర్పాట్లు!

- సాగర్ వద్ద ఎమర్జెన్సీ మోటార్లు సిద్ధం
- ప్రస్తుత నీటిమట్టం 512 అడుగులకు చేరగానే పంపింగ్ మొదలు
- ఆరేండ్ల తర్వాత అత్యవసర తరలింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ ప్రజల దాహార్తి తీర్చడంలో ముఖ్యభూమిక పోషిస్తున్న కృష్ణా జలాల నీటి నిల్వలపై జలమండలి ఆప్రమత్తమైంది. కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాది సరైన వరద లేకపోవడంతో గతంలో కంటే శ్రీశైలం, సాగర్‌లో కలిపి 12.86 టీఎంసీల నీటి కొరత ఏర్పడింది. దీనికితోడు ఏపీ కనీసం 15 టీఎంసీలు వాడుకునే అవకాశం కనిపిస్తుండడంతో ఈ వేసవిలో అత్యవసర పంపింగ్ తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. నాగార్జునసాగర్‌లో ప్రస్తుత నీటిమట్టం 520 అడుగులు ఉండగా, 512 అడుగులకు చేరగానే ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నగరానికి నీటిని తరలించే దిశగా జలమండలి ఏర్పాట్లు చేస్తున్నది. సాగర్ ఫోర్‌షోర్‌లో 8 అత్యవసర మోటార్లు (స్టాండ్‌బై 4 మోటార్లు)ఏర్పాటు చేసి నగరానికి రోజూ మూడు దశల్లో 270 ఎంజీడీల (మిలియన్ గ్యాలన్ పర్ డే) చొప్పున నీటి ని తరలించి కొరతను అధిగమించే దిశగా కసరత్తు చేస్తున్నది. ఈ మేరకు జలమండలి బుధవారం అత్యవసర మోటార్ల పంపింగ్ కోసం రూ.3.15 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. సాగర్‌లో 510 అడుగుల మేర నీటిని మెయింటెన్ చేయాలని ఇప్పటికే ఇరిగేషన్‌శాఖకు లేఖ రాసిన జలమండలి నీటిమట్టం 512 అడుగులకు చేరగానే అత్యవసర పంపింగ్ మొదలు పెట్టేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నది.

సరిగ్గా ఆరేండ్ల తర్వాత

నాగార్జునసాగర్ నుంచి అత్యవసర మోటార్ల ద్వారా నగరానికి నీటి తరలింపు జలమండలికి కొత్తేమీ కాదు. అత్యవసర తరలింపు ప్రక్రియను 2017లో కొన్ని నెలల పాటు నడిపించారు. సరిగ్గా ఆరేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడా పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ కృష్ణాబేసిన్‌లో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొంటే హైదరాబాద్‌కు నీటికష్టాలు తప్పనట్టే.

ఆర్డీఎస్‌ను పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం

- ప్రాజెక్టు ఆధునికీకరణకు త్వరలో సిఫారసులు

హైదరాబాద్, జనవరి24 (నమస్తే తెలంగాణ): రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ప్రస్తుత పరిస్థితి, నీటి వినియోగం తదితర అంశాలను సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) బృందం ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ ప్రాజెక్టు ఆధునీకరణపై పూర్తిస్థాయి అధ్యయనం కోసం ఈ బృందం త్వరలో తగు సిఫారసులు చేయనున్నది. ఆర్డీఎస్ ద్వారా నిర్దేశిత కేటాయింపుల మేరకు సాగునీరు రావడం లేదని ప్రభుత్వం చాలా కాలం నుంచి ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆనకట్ట ఎత్తును పెంచడంతోపాటు హెడ్‌రెగ్యులేటరీలు, కాలువల ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ని డిమాండ్ చేస్తున్నది.సుంకేశులకు నీరు రావడం లేదని ఏపీ సైతం ఫిర్యాదు చేయడంతో ఆర్డీఎస్‌పై సమగ్ర అధ్యయనం చేయించాలని 16వ సమావేశంలో కేఆర్ఎంబీ నిర్ణయించింది. ఆ బాధ్యతను పుణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు అప్పగించేందుకు ఇటీవల సంప్రదింపులు జరపడంతోపాటు సంబంధిత మార్గదర్శకాలను సైతం నిర్ధేశించింది. ఈ అధ్యయనానికి రూ.24 లక్షలు ఖర్చవుతుందని సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రాథమిక అంచనాను సమర్పించింది. అయితే ఆర్డీఎస్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి వివరాణాత్మక నివేదిక సమర్పించాలని కేఆర్ఎంబీ కోరింది. ఈ నేపథ్యంలో ఇటీవల క్షేత్రస్థాయిలో ఆనకట్టను పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్ఎస్ ఇంజినీర్లు ఐజాక్, కుంజీర్, కేఆర్ఎంబీ ఇంజినీర్ శివశంకర్ త్వరలో తమ అంచనా నివేదికను సమర్పించనున్నట్టు తెలిసింది.

9న తుంగభద్ర బోర్డు సమావేశం

తుంగభద్ర రివర్ బోర్డు 221వ సమావేశాన్ని ఫిబ్రవరి 9న నిర్వహించనున్నారు. ఈ మేరకు బోర్డు చైర్మన్ బుధవారం సమాచారం అందించారు. ఏపీ విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది బోర్డు సమావేశాన్ని విశాఖలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

యాసంగి పంటల సాగులో తగ్గుదల

- 4 లక్షల ఎకరాలకు తగ్గిన సాగు విస్తీర్ణం
- 3 లక్షల ఎకరాల మేర తగ్గిన వరి సాగు
- నీటి విడుదలలో నిర్లక్ష్యంతో తీవ్ర ప్రభావం

యాసంగి పంటల సాగులో తేడా

పంట రకం	నిరుడు	ప్రస్తుతం (ఎకరాల్లో)
జొన్న	81 వేలు	1.23 లక్షలు
మొక్కజొన్న	4.70 లక్షలు	4.59 లక్షలు
శనగ	3.44 లక్షలు	2.50 లక్షలు
వేరుశనగ	2.18 లక్షలు	1.97 లక్షలు

హైదరాబాద్, జనవరి 24(నమస్తే తెలంగాణ): యాసంగి పంటల సాగు విస్తీర్ణంలో తగ్గుదల కనిపిస్తున్నది. గత యాసంగితో పోల్చితే ఇప్పటివరకు సుమారు 4 లక్షల ఎకరాల్లో తగ్గుదల నమోదైంది. వ్యవసాయ శాఖ బుధవారం పంటల సాగుపై విడుదల చేసిన నివేదికలో ఈ విషయం తేటతెల్లమైంది. నిరుడు యాసంగిలో ఇదే సమయానికి మొత్తం 45.96 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా ప్రస్తుతం 42.21 లక్షల ఎకరాలకే పరిమితమైంది. వరి సాగు భారీగా తగ్గుదల కనిపిస్తున్నది. మొత్తం 4 లక్షల ఎకరాల్లో వివిధ పంట సాగు తగ్గితే ఇందులో ఏకంగా 3 లక్షల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం తగ్గడం గమనార్హం. నిరుడు ఇదే సమయానికి 33.25 లక్షల ఎకరాల్లో వరి సాగవగా, ప్రస్తుతం 30.43 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఒక్క జొన్న పంట తప్పా మిగిలిన అన్ని ప్రధాన పంటల సాగు విస్తీర్ణం తగ్గింది.

55 లక్షల ఎకరాలకే పరిమితం?

నిరుడు యాసంగిలో మొత్తంగా 72.63 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ యాసంగిలో మాత్రం 55 లక్షల ఎకరాల వరకు సాగయ్యే అవకాశాలున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. సాగు తగ్గుదలకు ప్రభుత్వం సాగునీరు అందించకపోవడమే ప్